

# మనిషికి అసాధ్యం లేదు

శంకరాపురమనే ఊళ్లో సుబ్బయ్య, కృష్ణయ్య అనే మిత్రులుండేవారు. సుబ్బయ్యది వ్యాపారం, కృష్ణయ్యది వ్యవసాయం. ఇద్దరూ చిన్నప్పటి నుంచి మిత్రులు.

శంకరాపురం చుట్టుపక్కల పది ఊళ్లకి కేంద్రం అవడంవల్ల సుబ్బయ్య వ్యాపారం దిన దినాభివృద్ధి చెంది, త్వరలోనే అతను లక్షాధికారి అయ్యాడు. కృష్ణయ్య తన పది ఎకరాల పొలంతో ఎదుగూ బొదుగూ లేకుండా అలాగే వుండి పోయాడు.

ఒక రోజు స్నేహితులిద్దరి మధ్య 'అదృష్టం' గురించి వాదన జరిగింది.

మాటల మధ్యలో కృష్ణయ్యను, "ఇక నీ జీవి తాంతం దరిద్రం అనుభవించాల్సిందే. దేనికైనా అదృష్టం వుండాలి" అన్నాడు సుబ్బయ్య కించ పరుస్తున్న ధోరణిలో

సుబ్బయ్య మాటలకి కృష్ణయ్యకు కోపం వచ్చింది.

"నీకున్న డబ్బు కేవలం అదృష్టం వల్ల వచ్చిందని భావిస్తున్నావు లాగుంది. నీ వ్యాపారంలో ఎన్నో మోసాలు చేస్తేగాని రాలేదా డబ్బు. ప్రభుత్వానికి న్యాయంగా చెల్లించాల్సిన పన్నులు ఎగ్గొట్టి, అక్రమమార్గాలు పట్టి సంపాదించావు. ఆ డబ్బు చూసుకుని అదృష్టం అని మురిసిపోకు," అన్నాడు ఘాటుగా కృష్ణయ్య.

"అవన్నీ నువ్వూ చేసి సంపాదించరాదా," నవ్వుతూ అన్నాడు సుబ్బయ్య.

"నీతి నిజాయితి వదిలేస్తే నేను సంపాదించ గలను. ప్రజలను మోసగించి లక్షలు సంపాదిస్తే నా మనస్సాక్షి ఒప్పుకోదు," అన్నాడు కృష్ణయ్య.

"చేతగానివాళ్ళు అనే మాటలే యివి. దేనికైనా అదృష్టం వుండాలి, దేవుడు దయ చూడాలి," అన్నాడు సుబ్బయ్య నవ్వేస్తూ.

సుబ్బయ్య నవ్వు చూసి కృష్ణయ్యకు చిరా కెత్తుకు కొచ్చింది.

"అలాగా సుబ్బయ్యా! చూడు, సంవత్సరం

లోపు నేనూ లక్షలు సంపాదిస్తాను," అన్నాడు ప్రతిజ్ఞ చేసే ధోరణిలో కృష్ణయ్య.

సరిగ్గా ఆ సంవత్సరమే సకాలానికి పడాల్సిన వానలు కురవలేదు. నీటివసతికి వర్షం మీదే ఆధారపడ్డ ఆ ఊరి రైతులు ఆశగా ఎప్పుడు వానలు పడతవా అని ఆకాశంకేసి చూడసాగారు.

ఆ వేళ కృష్ణయ్య పొరుగూరి నుంచి వస్తూ ఊరి పొలిమేరలో రాబందుల గుంపును చూసి ఆగిపోయాడు.

దేవుడి పేరున ఊళ్లో వదిలేసిన ఆబోతు బసవన్న నిన్ననే చచ్చిపోయింది. దాన్ని ఊరి చివరకి ఈడ్చిపారేశారు. దాని శవాన్ని రాబందులు పీక్కుతింటున్నాయి.

ఆ దృశ్యం చూసి కృష్ణయ్య మనసులో మెరుపు లాంటి ఆలోచన ఒకటి వచ్చింది.

వర్షాలు కురవక మరో పదిరోజులు గడిచాయి.

ఊళ్లోని రైతులంతా సకాలానికి వర్షాలు కురవనందుకు విచారిస్తూ రచ్చబండ వద్ద చేరారు. కృష్ణయ్య వాళ్లను సమీపించి, "మన ప్రాంతంలో వర్షాలు కురవకపోవడానికి కారణం ఏమిటో నేను తెలుసుకున్నాను," అన్నాడు అందరికీ వినపడేట్టు.

రైతులంతా కృష్ణయ్యకేసి ఆశగా చూసి, సంగతేమిటో చెప్పమని వేధించారు.

"పరమేశ్వరుడు మన మీద ఆగ్రహించాడు. ఆయన కోపించడం వల్లనే వర్షాలు కురవలేదు. తొందర్లోనే మన ఊరు అగ్ని ప్రమాదంవల్ల బూడిదవుతుంది," అన్నాడు రైతుల మొహాలు చూస్తూ కృష్ణయ్య.



"పరమేశ్వరుడెందుకు మనమీద ఆగ్రహిం చాడు," అని రైతులు అడిగారు.

"ఆయన బిడ్డ బసవన్న మరణిస్తే ఊరవతలకి ఈడ్చి పారేసి మహా అపచారం చేశారు. ఆ బసవన్నకు కర్మకాండ చెయ్యకుండా వున్నందుకే శివుడు మనమీద ఆగ్రహించాడు," అన్నాడు కృష్ణయ్య.

"ఇదంతా నీ కెవరు చెప్పారు?" అని మళ్లా ప్రశ్నించారు రైతులు.

"వారంరోజుల క్రితం బసవన్న నా కలలో కని పించాడు. ఏమిటోనని అప్పటికి ఊరుకున్నాను. కాని రోజూ కలలోకి రాసాగాడు," అన్నాడు విచా రంగా కృష్ణయ్య.

చనిపోయిన బసవన్నని ఊరవతలకి ఈడ్చి పారవేసిన మాట నిజం కాబట్టి రైతులంతా కృష్ణయ్య మాటలను ఎంతో శ్రద్ధగా విన్నారు.

చివరికి వాళ్లు, "మరి ఇప్పుడేం చేస్తే పరమేశ్వరుడికి కోపం చల్లారుతుంది," అని ఎంతో ఆందోళనతో అడిగారు.

"బసవన్నని చనిపోయాక అలా ఈడ్చి పారేసినా, దానికి మనమీద కోపంలేదు. పరమే శ్వరుడికి మనమీద ఆగ్రహం తగ్గే తరుణోపాయం కూడా తనే చెప్పింది. తన పేరుమీద మన ఊళ్లో ఒక గుడి కట్టించి, బసవన్న బంగారు విగ్రహాన్ని ప్రతిష్ఠించమని ఆదేశించింది," అన్నాడు కృష్ణయ్య తన్మయంతో చేతులుజోడిస్తూ.

గుడి కట్టించే బాధ్యత అంతా కృష్ణయ్య మీదే పెట్టారు.



గుడి కట్టాలని నిర్ణయం తీసుకున్న మూడో నాటికల్లా వర్షాలు ప్రారంభమయ్యాయి. రైతులకు కృష్ణయ్య మాటల్లో మరింత గురి ఏర్పడింది. అంతా ఆ పరమేశ్వరుడి దయ అనుకున్నారు.

కృష్ణయ్య తమ ఊళ్లోనూ, చుట్టుపట్ల వున్న ఊళ్లల్లోనూ తిరిగి చందాలు వసూలు చెయ్య సాగాడు.

అనుకున్న ప్రకారం వసూలయిన డబ్బుతో బ్రహ్మాండమైన గుడి తయారయింది. బసవన్న బంగారు విగ్రహాన్ని ఊరేగించి, గుళ్లో ప్రతిష్టించారు.

గుడి వ్యవహారమంతా పూర్తయ్యాక ఒక రోజు కృష్ణయ్య సుబ్బయ్యను కలుసుకుని, "మిత్రమా, నేనీ వ్యవహారంలో రెండు లక్షలు వెనకేసుకున్నాను," అన్నాడు.

సుబ్బయ్య మిత్రుడిమాట ముందు నమ్మలేదు కాని, కృష్ణయ్య తను వెనకేసిన రెండు లక్షలూ చూపాక నమ్మక తప్పలేదు.

"సుబ్బయ్యా! ఇదంతా మనిషి కృషికి ఏదీ అసాధ్యం కాదు అని నిరూపించటానికే చేశాను. ప్రజల సొమ్ము నాకు వద్దు," అన్నాడు కృష్ణయ్య.

"మరి యీ డబ్బంతా ఏంచేస్తావు?" కుతూహలంతో అడిగాడు సుబ్బయ్య.

"ప్రజల బాగుకే ఉపయోగిస్తాను. మంచి నీళ్ల బావులు తవ్వించటం, సత్రాలు కట్టించటం లాంటి ప్రజోపయోగకరమైన పనులు చేస్తాను," అన్నాడు ఎంతో తృప్తితో కృష్ణయ్య.

"నాకో అనుమానం కృష్ణయ్యా! ఇంతకీ వర్షాలు ఎలా పడ్డాయంటావు? ఆ దేవుడి మహిమేనా?" అని అడిగాడు సుబ్బయ్య.

"మామూలుగా ప్రతి సంవత్సరం కురిసే వర్షాలు యీ యేడు కాస్త ఆలశ్యమయ్యాయి. దాన్ని ఆధారం చేసుకుని నేనీ నాటకం ఆడాను," అన్నాడు కృష్ణయ్య.

కృష్ణయ్య నిజాయితీకి సుబ్బయ్య ఎంతో సంతోషించాడు. ఆ తర్వాత సుబ్బయ్య కూడా ప్రజోపయోగకరమైన పనుల్లో కృష్ణయ్యకు సహాయ పడ్డాడు.

